క్లుప్తంగా

'కల్యాణలక్ష్మి' చెక్కు అందజేత



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన గోవర్ధన్ చారి కుమార్తె పేరున వచ్చిన కల్యాణలక్ష్మి చెక్కును గురువారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్రహంలింకన్ అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ, అక్కల మహదేవన్‌గౌడ్, సాయిబాబా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మామిడి' రైతులకు అవగాహన సదస్సు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారి కృష్ణ తెలిపారు. మామిడి తోటల పెంపకంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించేందుకు కేవీకే మదనాపురం శాస్త్రవేత్తలు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వపరంగా అందుతున్న సబ్సిడీల గురించి రైతులకు వివరిస్తారని, మామిడి తోటలను సాగు చేసే రైతులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గురువారం ఏడీ వేణు, ఏఈ సురేష్, ఆర్ఐ రాధాకృష్ణ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శివనారాయణ, వినోబారెడ్డి, గోవిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడులు భేష్



వీపనగండ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె రాణి గురువారం తమ ఇద్దరు పిల్లలను మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. చిన్నతనంలో తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నామని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా అన్ని రకాల వసతులు ఎస్ఐతో పాటు ఆమె భర్త తిరుమలేష్ అన్నారు. కూతురు అభిజ్ఞను అంగన్‌వాడీ కేంద్రంలో, కుమారుడు ఆనంద్‌ను ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు వారు తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అమరచింత: నిత్యం పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో గురువారం పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలను తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కేసు నమోదు

పాన్‌గల్: కంది పంటను గేదెలతో మేపించిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన దిండి వెంకటస్వామి, అతని మరదలు సాగు చేసిన చేసిన కంది పంటను ఈనెల 25వ తేదీన 50 గేదెలతో దిండి వెంకటస్వామి సోదరుడు కృష్ణయ్య మేపించాడు. ఈ గేదెలు గ్రామానికి చెందిన పరమేశ్వర్‌రెడ్డికి చెందినవని, ఆయన ప్రోత్సాహంతోనే తమ సోదరుడు కృష్ణయ్యం కంది పంటను మేపించడంతో దాదాపుగా రూ.40 వేల నష్టం జరిగిందని వాపోయారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌లో ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణలో నాయకులు



ఖిల్లాఘనపురంలో..

వీరనారి చాకలి ఐలమ్మ

సాక్షి, నెట్‌వర్క్: భూమి కోసం భుక్తి కోసం దొరలను ఎదిరించి పోరాటాల్లో ముందున్న వీరనారి ఐలమ్మ అని నాయకులు అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా రజక సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రజకులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

■ ఆత్మకూర్ పట్టణ పురవీధుల గుండా రజకులు ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్‌లో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలరాజు, ప్రసాద్, రాములు, రమేష్, శ్రీను, ఆనంద్, తిరుపతి, విజయ్, సత్యనారాయణ, తాయప్ప, రాము, మోహన్ పాల్గొన్నారు.

■ పాన్‌గల్ మండలంలోని గోప్లాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సురభి పుల్లారావు మాట్లాడుతూ మంత్రి జూపల్లి ఐలమ్మ విగ్రహాన్ని ఇప్పించగా.. అవరసమైన స్థలాన్ని కీ.శే. ఉజ్జయిని బుచ్చారావు కుమారులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, డోకయ్య, చంద్రయ్య, శేఖర్, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

■ పెబ్బేరు పట్టణ కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్, రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పి ంచారు.

■ మదనాపురం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ మల్లికార్జున్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, మార్కెట్ మాజీ చైర్మన్ వెంకటనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, రజకసంఘం నాయకులు

■ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరవనిత చాకలి ఐలమ్మ పాత్ర కీలకమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట పట్టణంలోని చౌరస్తాలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రజకులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, సంద వెంకటేష్ తదితరులు ఉన్నారు.

■ ఖిల్లాఘనపురంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, రవీందర్, శ్రీనివాసులు, రమేష్, ఆశన్న, బాబు, యాదగిరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

■ అమరచింత మండల కేంద్రంలో రజక సంక్షేమ సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సుతారి శ్రీనివాసులు, కోరి శ్రీనివాసులు, సత్యందర్ తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో..



పెబ్బేరులో..



ఆత్మకూర్‌లో..

'ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభువినయ్ విధులకు హాజరు కావటం లేదని, ఇంటి వద్దనే ఉంటున్నా.. విధులు నిర్వహిస్తున్నట్లు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారని, విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కలెక్టర్ ఆదర్శ్ సురభికి ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా ఆయన కార్యాలయానికి రావటం లేదని, బయోమెట్రిక్ హాజరు పరిశీలన చేయాలని కోరారు. కార్యాలయం హాజరు రిజిస్టర్‌ను ఇంటికి తెప్పించుకుని సంతకాలు చేసి వేతనం పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్‌లోని ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల విధి నిర్వాహణపై దృష్టి సారించాలని రాచాల కలెక్టర్‌ను కోరారు. కల్లు లైసెన్స్ దారులను, వైన్‌షాప్ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈఎస్ తీరుమార్చుకోకుంటే.. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజన్నయాదవ్, మహేందర్‌నాయుడు, శివగౌడ్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లిలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందడంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40 వేల పరిహారం చెక్కును గురువారం ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతు చెంది శేషయ్యకు చెందిన ఎద్దు 2021 సంవత్సరంలో ప్రమాదవశాత్తుతో విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దీంతో రైతు పరిహారం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా ఆ పరిహారం చెక్కు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా రైతుకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంచందర్, వెంకటస్వామి, మన్యం, నాగేంద్రం, రాజయ్య, గోపాల్, తెలుగు నర్సింహ పాల్గొన్నారు.

'ప్రశస్త' యాప్‌పై అవగాహన

కోడేరు: ప్రశస్త యాప్‌పై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తునట్లు ఐఆర్ఈపీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఈ సందర్భంగా మండలం కేంద్రంలో ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 26 వరకు 1వ తరగతి ఇంటర్ వరకు విద్యార్థులకు 60 అంశాలపై సర్వే చేపట్టాలన్నారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక, విద్య సంబంధిత లోపాలను గుర్తించాలని వివరించారు.

మార్కెట్ డైరెక్టర్లకు సన్మానం



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, మండల గౌడ సంఘం నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మాలపల్లె రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో పెబ్బేరు మార్కెట్ యార్డులో డైరెక్టర్లుగా ఎన్నికైన కవితగౌడ్, రామన్‌గౌడ్‌ను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, బస్వరాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, కోటేశ్వర్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, మల్లికార్జున్ గౌడ్, సర్వేస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చితికిన వృద్ధ వీఆర్ఏల బతుకులు

వనపర్తి రూరల్: 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని గురువారం పెబ్బేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వృద్ధ వీఆర్ఏలు ధర్నా చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి గత ప్రభుత్వం తమని విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. కానీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వారి వారసులకు ఉద్యోగ అవకాశాలు రాలేదని, 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏలు ఉద్యోగాలు కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వృద్ధ వీఆర్ఏలు లక్ష్మి, దేవమ్మ, ఓంకార్, మన్యం, రాజు, సహదేవుడు, ధర్మయ్య, కురుమయ్య, రమేష్, చంద్రి తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శులపై వేధింపులు సరికావు'



పాన్‌గల్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న పంచాయతీ కార్యాదర్శులపై వేధింపులు సరికాదని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలో కలెక్టర్ అకారణంగా పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే కార్యదర్శులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేసారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డికి అందజేశారు.



ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద..

కార్యవర్గం ఏర్పాటు

మండల పంచాయతీ కార్యాదర్శుల కార్యవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా హరిరాంసాగర్, అధ్యక్షుడిగా దాసు, ప్రధానకార్యదర్శిగా మణ్యం, కోశాధికారిగా వంశీధర్‌రెడ్డి, మీడియా కన్వీనర్‌గా సయ్యద్‌రాజీబ్, ఉపాధ్యక్షులుగా శిరీష, నాగరాజు, సలహాదారులుగా లక్ష్మీనారాయణ, జైపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నస్రీన్‌బేగం, వంశీ, నరేష్, భాస్కర్, తదీతరులు ఉన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

ఖిల్లాఘనపురం: గ్రామాల్లో సర్పంచులు లేకున్నా ఎన్నో ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్న నల్లగొండ ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం సరికాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఖిల్లాఘనపురం ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

పాన్‌గల్: నల్గొండ జిల్లాలో ఇద్దరు పంచాయితీ కార్యదర్శులను సస్పెండ్ చేయటాన్ని నిరసిస్తూ ఎంపీడీఓ, మండల పంచాయతీ కార్యదర్శులు గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి సంపూర్ణంగా సహకరించాలని మాజీ ఎంపీపీ డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక అయ్యప్పకాలనీలో రూ. 3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి ఇది వరకే రూ.1.70 కోట్లు ఖర్చయ్యిందని, ఇంకా రూ.1.30 కోట్లు నిధులను విరాళాల రూపంలో అందిస్తే నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఈసందర్భంగా స్థానిక ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు కరపత్రాలను అందించారు. విరాళాలు ఇవ్వాల్సిన భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులకు నేరుగా లేదా ఫోన్‌పే 94411 61898 నంబర్‌కు వేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్ ఉన్నారు.

సంగీత వాయిద్యాల వితరణ



ఆలయానికి సంగీత సామగ్రి అందజేస్తున్న దాత మేఘారెడ్డి తదితరులు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.56 వేల విలువ చేసే భజనకు అవసరమయ్యే సంగీత వాయిద్యాలను మేఘారెడ్డి అందజేశారు. ప్రతి నెల 7వ తేదీన పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేయడంతో పాటుగా భజన చేస్తూ భక్తిగీతాలు ఆలపిస్తారు. సంగీత వాయిద్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు భక్తులు చెప్పడంతో మానాజీపేటకు చెందిన మేఘారెడ్డి గురువారం భజనకు సంబంధించిన వాయిద్యాలను అందించడంతో మేఘారెడ్డికి ఆలయ కమిటీ, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, గోనెల శ్రీను, గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' వాల్‌పోస్టర్ల విడుదల

వనపర్తిటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే మహాగర్జనకు విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ ఒకేషనల్ కళాశాల ఆవరణలో చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలిపివేయాలని, శిథిలావస్థకు చేరిన పాఠశాలల మరమ్మతులు చేయించాలని, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు నిలిపివేసి.. ఇంటర్మీడియట్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్, భరత్, మౌనిక, పుష్ప, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పెబ్బేరు మండల అధ్యక్షుడు లక్ష్మన్, కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం పెబ్బేరు మండల కేంద్రంలో చలో హైదరాబాద్ మహాగర్జనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.8,245 కోట్ల స్కాలర్‌షిప్, రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో శివకోటి, వెంకటేష్, మహేష్, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

'ఖిల్లా' ఎంఈఓగా జయశంకర్



ఖిల్లాఘనపురం ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన జయశంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఖిల్లాఘనపురం: మండల విద్యాధికారిగా పి. జయశంకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఉషారాణి భూత్‌పూర్ మండల విద్యాధికారిగా బదిలీపై వెళ్లారు. సోళీపురం ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న జయశంకర్ జిల్లా విద్యాధికారి ఆదేశానుసారం మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను మండల ఉపాధ్యాయులు, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య, మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు ఓర్సు యాదయ్య, మల్లేష్, శ్రీరాములు, అనిల్‌కుమార్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



శ్రీరంగాపురం మండలంలో..

ఎంఈఓకు సన్మానం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల ఎంఈఓగా హనుమంతు గురువారం మండల ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఉన్న జయరాములు ఆయనకు బాధ్యతలు అపగించారు. నూతన ఎంఈఓ హనుమంతు, గత ఎంఈఓ జయరాములుకు మండల టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు నరసింహ, ప్రధాన కార్యదర్శి బి నరసింహ, కురుమన్న, చిన్నస్వామి, శివశంకర్, వెంకటస్వామి, శ్రవణ్‌కుమార్, వెంకటరమణ, నరసింహ, వెంకటేష్ తదితరులు పాల్గొ న్నారు.

బాధితులకు ఎల్వోసీ అందజేత

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన గొల్ల గట్టయ్య, కుమ్మరి చిన్నయ్య అనారోగ్య సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవడానికి వారు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన గొల్ల గట్టయ్యకు రూ.1.50లక్షలు, కుమ్మరి చిన్నయ్య రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. గురువారం జిల్లెల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పాండురావు, కుమార్‌గౌడ్, సురేష్‌గౌడ్, శాంతయ్య, నారాయణ, పెద్ద కోటయ్య, రాజు, కురుమయ్య, తిరుపతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి ఎల్వోసీ అందజేస్తున్న నాయకులు

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులు దూరం



చిన్నంబావిలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, బూట్లు అందిస్తున్న ఎంపీడీఓ

సాక్షి, నెట్‌వర్క్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని, పంచాయతీ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామాలు శుభ్రంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి బీరం సుబ్బారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, ప్రత్యేకాధికారి సుశిత అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభీ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వరలక్ష్మి, అబ్రహంలింకన్, మురళి, ఎంపీడీఓలు ప్రసన్నకుమారి, సుజాత, శ్రీనివాసరావు, రాఘున, శ్రీనివాసులు, రమణారావు, రవీందర్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు, వైద్యులు నందకిషోర్, వసంత, చైతన్య, భవాని, రూపశ్రీ, మెడికల్ ఆఫీసర్ రాకేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.